www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 అక్టోబర్ 2025

5

తిరుపతి

లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి

బివి రమణయ్య, సిఐటియు, ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్రవ్యాప్తంగా ఆటో లైసెన్సులు కలిగి ఉన్న నిరుపేద ఆటో డ్రైవర్లు అందరికీ ఆటో డ్రైవర్ల సేవ పథకాన్ని వర్తింపజేయాలి. రవాణ రంగ కార్మిక కుటుంబాలకు రక్షణగా సంక్షేమ బోర్డు ఏర్పాలు చేయాలి. అధిక పెనాల్టీలను విధించేందుకు తీసుకొచ్చిన జీవో నంబర్ 21ని రద్దు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఆటో క్యాబ్ డ్రైవర్లు దాదాపు 12 లక్షల మంది ఉంటే, శనివారం వడుదల చేసిన ఆటో డ్రైవర్ సేవ పథకంలో కేవలం 2లక్షల 90వేల 669 మంది మాత్రమే ఉన్నారన్నారు. బ్యాటరీ చార్జింగ్ ఆటోలను ఇంటి వద్ద కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటి వస్తుందని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ఆటో డ్రైవర్ సేవ పథకాన్ని పొందేందుకు విధించిన షరతులను ఎత్తేయాలి.

'స్టూడెంట్ నంబర్ 1' యుగంధర్

దూరవిద్యలో 4 డిగ్రీలు, 3 పీజీలు 'జీవిత ఖైదీ'గానే అవార్డులు కైవసం క్షమాభిక్ష పెట్టాలని తల్లి వేడుకోలు

తెలిసీతెలియని వయస్సులో స్నేహితులతో కలిసి ఆకతాయిగా చేసిన 'నేరం'తో 'జీవితఖైదు' శిక్ష పడింది యుగంధర్‌కు.. 2010లో కోర్టు తీర్పు మేరకు యుగంధర్, కిషోర్‌లకు జీవిత ఖైదు వేయడంతో అప్పటినుండి కడప సెంట్రల్ జైల్లో 15 ఏళ్లగా శిక్షను అనుభవిస్తున్నారు. అయితే 'శిక్షా' కాలంలో చేసిన నేరాన్ని గుర్తుతెచ్చుకుంటూ కుంగిపోలేదు.. కడప సెంట్రల్ జైలుకు వెళ్లే నాటికి ఇంటర్ పూర్తి చేసిన యుగంధర్, దూర విద్య ద్వారా 4 డిగ్రీలు, 3 పీజీలను చేసి 'స్టూడెంట్ నంబర్ 1' అనిపించుకున్నాడు. జీవితఖైదీగా ఉంటూనే అనేక అవార్డులను కైవసం చేసుకున్నారు. చదువు తెచ్చిన జ్ఞానంతో తన కొడుక్కు జ్ఞానోదయం అయి ఉంటుందని, క్షమాభిక్ష పెట్టి వృద్ధాప్యంలో కొంతైనా తనకు సంతోషం కలిగించాలని తల్లి గునకల చెంగమ్మ వేడుకొంటోంది.

స్నాతకోత్సవంలో బంగారు పతకం అందుకుంటూ ..

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన గునకల బోయశెట్టి, గునకల చెంగమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు యుగంధర్, మేఘన, ఉమాదేవి. స్వగ్రామంలో వీరి వత్తి గాజుల తయారీ చేసి అమ్మడం. గాజుల వ్యాపారం ఆశించినంతగా లేకపోవడంతో 1995 లో జీవనోపాధి నిమిత్తం చెంగమ్మ తన అక్క సహాయంతో తిరుపతికి కుటుంబ సమేతంగా వచ్చింది. యుగంధర్ 5వ తరగతి వరకు తన స్వగ్రామంలోనే ఇంగ్లీష్ మీడియం చదివాడు. అనంతరం కుటుంబం తిరుపతికి వెళ్లడంతో 6 నుండి 10వ తరగతి వరకు గోవిందరాజ స్వామి హై స్కూల్ లో పూర్తి చేశాడు. యుగంధర్ తల్లి చెంగమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలో యుగంధర్ తన స్నేహితులను అతని పెద్దమ్మ ఇంటికి తరచూ తీసుకొని వెళ్లేవాడు. దీంతో అతని పెద్దమ్మ కుమారుడు పలుమార్లు మందలించేవాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల తర్వాత యుగంధర్ తన పెద్దమ్మ కొడుకు బిడ్డ సన్నీ(ఏడేళ్ల బాలుడు) స్కూలుకి వెళు తుండగా యుగంధర్ స్నేహితులు హరినాథ్ రెడ్డి, రాజా, కిషోర్‌లతో కలిసి ఆ బాలుని కిడ్నాప్ చేశారు. రెండు రోజుల తర్వాత తుమ్మలగుంట చెరువులో బాలుని మతదేహం పోలీసులకు లభ్యమయ్యింది. పోలీసుల విచారణ సమయంలో నిందితులైన హరినాద్ రెడ్డి, రాజా పారిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తెలిపింది. యుగంధర్, కిషోర్లను తిరుపతి సబ్ జైల్లో ఉంచారు. 2010లో కోర్టు తీర్పు మేరకు యుగంధర్, కిషోర్‌లకు జీవిత ఖైదు వేయడంతో అప్పటినుండి కడప సెంట్రల్ జైల్లో 15 ఏళ్లగా శిక్షణను అనుభవిస్తున్నారు.

ఈ సంఘటన అనంతరం బోయ శెట్టి దంపతులు తమ స్వగ్రామమైన జంగాలపల్లికి తిరిగి వచ్చేశారు. కొన్నేళ్ల క్రితం వీళ్ళ కుమార్తెలకు వివాహం జరిగింది. అప్పటినుండి తమ కుమారుడి రాక కోసం ఎదురుచూస్తూ బోయశెట్టి మానసికంగా ఒత్తిడికి లోనై గతేడాది 2024లో మతి చెందాడు. అటు కొడుకు కోసం ఎదురుచూస్తూ ఇటు భర్త మరణించడంతో చెంగమ్మ ఆరోగ్యం క్షీణిస్తూ ఆవేదనతో కాలం గడిపేస్తున్న పరిస్థితి. 2024లో అతని తండ్రి దహన క్రియలకు పోలీసులతో కలిసి వచ్చాడు. ఈ ఏడాది మే నెలలో ఫెరోల్ మీద 15 రోజులు స్వగ్రామమైన జంగాలపల్లిలో యుగంధర్ ఉన్నాడని ఆమె తెలిపారు.

యుగంధర్ తల్లి గునకల చెంగమ్మ

యుగంధర్‌కు చదువుపై ఉన్న మక్కువను గుర్తించిన జైలు అధికారులు అతన్ని ప్రోత్సహించారు. దూర విద్య ద్వారా జైల్లోనే ఉండి విద్యాభ్యాసం చేస్తూ 4 డిగ్రీలు, 3పీజీ లు పూర్తి చేశాడు. బిఏ పరీక్షల్లో 8.2 పాయింట్లు సాధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలిచాడు. హైదరాబాదులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దూరవిద్య యూనివర్సిటీ అతనికి గోల్డ్ మెడల్ ప్రకటించింది. దీంతో తాజాగా మంగళవారం జరిగిన 26వ స్నాతకోత్సవంలో బంగారు పతకం, బుక్ ప్రైజ్ అవార్డును అందుకున్నారు.

నా బిడ్డకు క్షమాభిక్ష పెట్టండి

గునకల చెంగమ్మ, యుగంధర్ తల్లి

18 ఏళ్లగా జైల్లో శిక్ష అనుభవిస్తున్న నా బిడ్డ రాక కోసం ఎదురుచూస్తూ నా భర్త మానసికంగా కుంగిపోయి గత ఏడాది మరణించాడు. నా ఆరోగ్యమూ క్షీణించింది. చిన్నప్పటి నుంచి చదవంటే వాడికి ఇష్టం. నా కొడుకు సత్ప్రవర్తనతో ఉండి ఇన్ని డిగ్రీలు , గోల్డ్ మెడల్ సాధించాడని అనుకుంటున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని గౌరవ రాష్ట్రపతి ద్వారా క్షమా బిక్ష పెట్టి సత్ప్రవర్తన కింద ఇప్పటికైనా తమ బిడ్డను తన దగ్గరకు పంపించాలని వేడుకొంటోంది. ఆ చిన్నారి సన్నీ తల్లిదండ్రులు అనుభవించిన క్షోభను నేను కూడా ఇన్నేళ్లుగా అనుభవిస్తున్నా. ఈ సంఘటన అనంతరం తనకు తోడబుట్టిన నలుగురు అక్క చెల్లెళ్లతో బంధం కోల్పోయానని ఆమె భావోద్వేగంతో వెలిబుచ్చారు.

కొడుకు తోడు ఎంతో అవసరం..

గునకల హరిబాబు, యుగంధర్ చిన్నాన్న

ప్రస్తుతం నాలుగు వేలు పెన్షన్‌తో జీవనం సాగిస్తోంది. 18 సంవత్సరాలు పూర్తయ్యాయని, తమ గోడును ప్రముఖ రాజకీయ నాయకులకు విన్నవించాలని యుగంధర్ తన తల్లికి తెలియజేసినా ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఎటు తిరగలేని పరిస్థితి. మేము చొరవ తీసుకుని ఇటీవల విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసాం. ఈ సమయంలో యుగంధర్ తోడు తన తల్లికి ఎంతో అవసరం. ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు క్షమాభిక్షపెట్టి యుగంధర్‌ను తన తల్లి వద్దకు చేర్చాలని కోరుకుంటున్నాం.

ఆటో డ్రైవర్లకు 'చేయూత'

- జిల్లాలో 14,375 మందికి రూ.21.56 లబ్ది
- కచ్చపి ఆడిటోరియంలో 'ఆటోడ్రైవర్ల సేవలో'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమం శనివారం జరిగింది. తిరుపతి జిల్లావ్యాప్తంగా 14,375 మంది డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వాహన యజమానులకు రూ. 21.56 కోట్ల లబ్ది చేకూరింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మెగా చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వయం శక్తితో ఎదిగే శ్రమజీవికి ప్రభుత్వం చేయూత అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాలలో ఆయా శాసనసభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లాలో అర్హులైన 14,375 మంది ఆటోరిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్స్‌క్యాబ్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వాహన యజమానులకు ఒక్కొక్కరికి రూ. 15వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ పథకం ద్వారా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది డ్రైవర్లకు 436 కోట్ల రూపాయలు అందించామన్నారు. గత వైసిపి ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో రూ. పదివేలు మాత్రమే ఇవ్వగా తమ ప్రభుత్వం 15000 రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం 260 కోట్ల రూపాయలు ఈ పథకం కోసం ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం 436 కోట్ల రూపాయలు ఇస్తోందని తెలిపారు.జగన్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఒక చేత్తో రూ.పదివేలు ఇస్తూనే ఫైన్ ల ద్వారా 20వేల రూపాయలు దోపిడీ చేసిందన్నారు. అంతే కాకుండా పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతంగా పెంచి జగన్ ప్రభుత్వం ఒక్కో ఆటో డ్రైవర్ పై ఏడాదికి 36 వేల రూపాయల భారం మోపిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్ల పై విపరీతంగా చలాన్లు రాసి వేధించడమే కాకుండా రోడ్డు టాక్స్ లు భారీగా పెంచి ఆటో డ్రైవర్ల రక్తాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం జలగలా పీల్చేశారన్నారు. తిరుపతిలో 11 కొత్త హోటళ్లు ప్రారంభం కానున్నాయని, తద్వారా ఆటోరిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్స్‌క్యాబ్ డ్రైవర్లకు మరింత లబ్ది కలగనుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, డిప్యూటీ మేయర్ రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి, మహిళా ఆటోడ్రైవర్ ఎ.లత, కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. మొత్తం 14,757 మంది ఆటోడ్రైవర్లు దరఖాస్తు చేసుకోగా 14,375 మంది లబ్ది పొందారు.

- శ్రీకాళహస్తిలో ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అయితే జిల్లా లెక్కల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 1965 మంది లబ్దిదారులు అని సూచించగా, 1883 మంది ఆటోడ్రైవర్లకు రూ. 15వేల చొప్పున దాదాపు మూడు కోట్ల సాయాన్ని అందజేసినట్లు ఎంఎల్ఏ తెలిపారు. ఎవరికైనా పథకానికి ఎంపిక కాకుండా ఉంటే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని ఎంవిఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

- వెంకటగిరి విశ్వోదయ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి ఎస్ఆర్ గార్డెన్స్ వరకూ ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణ, ఎంఎల్‌సి బీదా రవిచంద్ర, జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు ఆటోలో ఎక్కి ర్యాలీగా వెళ్లి లబ్దిదారులకు అందజేశారు.

- పుత్తూరులో ఆటోవాలా హమీద్‌బాషా స్పందిస్తూ తనతో మంత్రి నారా లోకేష్ మాట్లాడటం ఆనందంగా ఉందని తెలిపారు.

- గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీలో ఎంఎల్ఏ పాశిం సునీల్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గంలో 2,455 మందికి 3 కోట్ల 68 లక్షల రూపాయలను అందజేశారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డిఎస్‌పి గీతకుమారి పాల్గొన్నారు.

- చంద్రగిరి ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎంఎల్ఏ పులివర్తి నాని ఆదేశాల మేరకు ఆర్డీవో రామ్మోహన్, తహశీల్దార్ శివనామ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు జమ చేశారు. చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఆటోడ్రైవర్లు పాలాభిషేకం చేశారు.

- పిచ్చాటూరులో 999 మంది ఆటోడ్రైవర్లకు రూ. 1.50 కోట్ల మెగా చెక్కును ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం అందజేశారు. పిచ్చాటూరులోని శ్రీకాళహస్తి కూడలి నుంచి ఎంకెటి కల్యాణ మండపం వరకూ ఆటోర్యాలీ నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపిడిఒ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

నియోజక వర్గాల వారీగా ...

1.చంద్రగిరి	3,431
2. గూడూరు	2401
3. సత్యవేడు	1401
4. శ్రీకాళహస్తి	1965
5. సూళ్లూరుపేట	1970
6. తిరుపతి	2307
7. వెంకటగిరి	900

తిరుపతిలో చెరువులను తలపించిన రోడ్లు

తిరుపతి టౌన్ : తిరుపతి జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఐదు గంటలకు విపరీతమైన వర్షం నమోదు అయింది. ఉదయం 11 గంటలకు వర్షం శాంతించడంతో రాకపోకలు సాగాయి. వర్షం వల్ల పలు మండలాల్లో చిన్న చిన్న చెరువుల్లో నీటిమట్టం పెరిగింది. పలు రోడ్లు చెరువులను తలపించాయి. ఈ వర్షాల తీవ్రత మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. జిల్లాలో ముఖ్యంగా తూర్పు మండలాల్లో అప్రమత్తంగా ఉండాలనికలెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తిరుపతి నగరంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ ను 0877 22256776, 9000822909 సంప్రదించాలని సూచించారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి గ్రామ దేవత గంగమ్మ ఆలయ అభివృద్ధి అవసరాల నిమిత్తం ప్రవేటు స్థలం కొనుగోలు కోసం 5 లక్షలు విరాళాన్ని టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా అందివ్వడం సంతోషంగా ఉందని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వైష్ణవి హాస్పిటల్ అధినేత తన భర్త డాక్టర్ మునిశేఖర్, ఇతర తమ కుటుంబ సభ్యులతో కలిసి విరాళాన్ని ఆలయ ఈఓకు కరుణాకర్ రెడ్డి చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మీడియాతో మాట్లాడుతూ అందరి గ్రామ దేవత గంగమ్మ ఆలయ అవసరాల కోసం ఆలయానికి అనుకుని ఉన్న ప్రైవేటు స్థలాన్ని



కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులు కోసం ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో గంగమ్మ భక్తులుగా తమ కుటుంబం భాగస్వామ్యం కావాలని భావించి ఐదు లక్షల రూపాయలు ఆలయ ఈఓకు అందించామన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ హేమా కుమార్ రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రమేష్, మునయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమానికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ అనిత, ప్రశాంత్ దంపతులు వారి కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం దుప్పట్లు వితరణ చేశారు. నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు బాసటగా నిలుస్తున్న గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సేవలు మెచ్చి తమవంతు సాయమందించినట్లు ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ అనిత తెలిపారు. గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంస్థ మరింతమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించాలని ఆకాంక్షించారు.

మోహన్‌బాబు యూనివర్సిటీలో 'గ్లోబల్' లీడర్ల ఉపన్యాసాలు

ప్రజాశక్తి - చంద్రగిరి

రంగంపేటలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో గ్లోబల్ లీడర్ల ఉపన్యాసాలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. ఐఇఇఇ, పిఇఎస్, పిఇఎల్ఎస్, ఐఎఎస్ జాయింట్ చాప్టర్–హైదరాబాద్ సెక్షన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ కాంగ్రెస్ –2025 శనివారం ఘనంగా జరిగింది. ఛైర్మన్ డాక్టర్ విఎస్‌కె మూర్తి బలిజేపల్లి మాట్లాడుతూ మొదటిసారి మూడు సొసైటీలు ఒకే వేదికపై విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజ్ రామ్రావు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కల్యాణ్‌కుమార్ సేన్ (అమెరికా) బలమైన ఇంజినీరింగ్ పునాదులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కాంగ్రెస్ ద్వారా ఎంబియు పరిశ్రమతో అనుసంధానమైన ఇన్నోవేషన్ కేంద్రంగా మరింత ప్రతిష్టను సంపాదించింది.

జూ కీపర్స్ సేవలు కీలకం: సెల్వం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జంతు ప్రదర్శనశాలలో జంతువుల పూర్తి లక్షణ అలవాట్లను, మసలుటను తెలిసిన జూ కీపర్స్ సేవలు జూ నిర్వహణలో కీలకమైనవని శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం తెలిపారు. అంతర్జాతీయ జూ కీపర్స్ డే సందర్భంగా శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో ఎంపిక చేయబడిన 12 మంది జూ కీపర్స్ అందించిన సేవలకు గాను వారికి ప్రశంసా పత్రాలను అందించారు. జూ నిర్వహణలో మరింత మెరుగైన సేవలు అందించాలని, నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 4వ తేదీన అంతర్జాతీయ జూకిపర్స్ డే ను జరుపుకుంటారని అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్ర ప్రసాద్ తెలిపారు.

పెన్షన్ డబ్బు తీసుకుని పరార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు గ్రామ పరిధిలో పెన్షన్ పంపిణీ జాప్యం జరిగిందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కౌసల్య తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో 64 మందికి పింఛన్లు అందించాల్సిన రూ. 2.85 లక్షలను వార్డు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రాకేష్ తీసుకుని పరారయ్యాడు. గ్రామ పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు రాకేష్‌కు మోమో జారీ చేశామన్నారు.

తిరుపతిలో కారవాన్ టూరిజం..

20 కోట్ల పెట్టుబడులతో మంత్రివర్గ నిర్ణయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల యాత్రికులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి వేదిక కారవాన్ ప్రాజెక్టును తీసుకురానుంది. తొలి విడత 20 కోట్లు పెట్టుబడులతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నారు.. ఈ మేరకు మంత్రివర్గం శుక్రవారం నిర్ణయించింది.. కదిలే వాహనాలతో అన్ని సౌకర్యాలు కూడినదే 'కారవాన్ టూరిజం'. తిరుపతి చుట్టుపక్కల ప్రముఖ పుణ్యక్షేత్రాలు పాటు తలకోన, చంద్రగిరి కోట, నేలపట్టు, కైలాసకోన, తూపులపల్లి బీచ్లు ఉన్నాయి.. వీటిని సందర్శకులకు చూపేందుకు వీలుగా ఈ ప్రాజెక్టును అతి త్వరలో తీసుకోరాన్నారు..

తిరుపతిలో కారవాన్ టూరిజం అభివద్ధిపై తాజా సమాచారం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కారవాన్ టూరిజాన్ని రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ప్రవేశపెట్టేందుకు పనుల వేగం పెంచుతోంది. రాష్ట్రంలో వైజాగ్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి ఇతర ప్రదేశాల్లో కారవాన్ టూరిజం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని, విశాలమైన అడవి ప్రాంతాల్లో 'హోటల్–ఆన్–వీల్స్' వంటి ఆధునిక సౌకర్యాలతో కారవాన్ టూరిజం అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

తిరుపతిలో ఇటీవల రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది, అక్కడ కారవాన్ టూరిజం, హోమ్ స్టే, అడ్వెంచర్ టూరిజం వంటి కొత్త పద్ధతుల్లో పెట్టుబడిదారులకు పరిచయం చేశారు..ఈ టూరిజం విధానం ద్వారా పర్యాటకులకు కొత్త అనుభవాలు, అధిక సౌకర్యాలు, కుటుంబాలు, గ్రూపుల టూరిజం కోసం ఆకర్షణీయమైన ప్రయాణం అందించబడుతూ, ఇది స్థానిక ఆర్థికాభివద్ధికి, ఉద్యోగాల సష్టికి దోహదపడుతుంది. కరోనా తరువాత మళ్లీ పర్యాటకులు పెరిగిన నేపథ్యంలో, ప్రభుత్వాలు కారవాన్ పార్కులు, క్యాంపింగ్ స్థలాలు వంటి సౌకర్యాలను అభివద్ధి చేసే పనులు చేపట్టాయి. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రాంతాల్లో 15 కంటే ఎక్కువ జాయింట్ లొకేషన్లు కారవాన్ టూరిజం కోసం ఎంపిక చేశారు. పరిపాలనా అధికారుల ఆదేశాలతో, విమర్శలేతర రకమైన ప్రైవేట్, ప్రభుత్వ భూములపై ఈ పార్కుల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సీఎం చంద్రబాబు నాయుడు, టూరిజం మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో ఈ కారవాన్ టూరిజం ప్రారంభం కాగా, ఇది గ్రామీణ, అడవి ప్రాంతాల్లో పర్యాటకాభివద్ధికి కొత్త మోడల్ అవుతుంది. తద్వారా తిరుపతి ప్రాంతం కొత్త రకమైన సవారీలకూ, పర్యాటక ఆకర్షణావలికి రాబోతుంది.సారాంశంగా, తిరుపతి చుట్టుపక్క ప్రాంతాలు కారవాన్ టూరిజం అభివద్ధి రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక కీలక విప్లవం అవడం మొదలైంది. ఇది పర్యాటకులకు ఆధునిక, సౌకర్యసంపన్న ప్రయాణ మార్గాన్ని అందిస్తూ, ప్రాంతీయ ఆర్థికాభివద్ధికి, ఉద్యోగావకాశాలకూ పెద్దపీట వేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ చెబుతున్నారు. ఇలాంటి టూరిజం ప్రాజెక్టులో కేరళ, తమిళనాడు, కర్ణాటక ,గుజరాత్, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో అమలవుతున్నాయి.. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు టెండర్లు ఆహ్వానించనున్నారు.

మానవత్వమా..అదెక్కడ..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గత వారంలో జిల్లాలో చోటు చేసుకున్న రెండు వరుస ఘటనలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవత్వం కనుమరుగుతుందని అనడానికి మచ్చుకుగా నిలిచాయి. డిగ్రీలు చదివే యువత తోటి విద్యార్థిపై ర్యాగింగ్ పేరుతో దాడి చేసి ఘోరంగా అవమానించడం ఒకటైతే, రోజులు కూడా నిండని పురిటి బిడ్డను ప్రాణాలతో రోడ్డుపై పారేసి వెళ్లిన ఘటనలు జిల్లా వాసుల్లో కన్నీరు పెట్టించింది. జీవితాల్లో ఇన్ని ఘటనలు ఎదురవుతున్నా కొంతమందిలో మార్పు రాకపోవడం గమనార్హం.

అంతరిక్షంలో అద్భుతాలు సష్టిస్తున్నాం. అత్యాధునిక సాంకేతికాన్ని అందుపుచ్చుకుంటున్నాం. సష్టికి ప్రతి సష్టి చేస్తున్నాం. కానీ మనిషిని మనిషి గౌరవించడం మరుస్తున్నాం. ఈ పోటీ ప్రపంచంలో ఒకరికి మించి మరొకరు ఎదగాలనుకోవడం సాధారణమే. కానీ ఒకరిని తొక్కి పై చేయి సాధించాలనుకోవడం సరైనది కాదు. తిరుపతి జిల్లాలో ఈనెల 25, 26 తేదీలలో చోటు చేసుకున్న రెండు వరుస ఘటనలు జిల్లా వాసులను ఆలోచింపజేశాయి. మొదటిది... పుత్తూరు సమీపంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఐదుగురు తమకు జూనియరైన మరో విద్యార్థి పై ర్యాగింగ్ పేరుతో దాడి చేసి చితక బాదారు. తాము చెప్పింది చేయలేదని కాళ్లతో తన్నుతూ విచక్షణ రహితంగా దాడి చేసే గాయపరిచారు. పైపెచ్చు ఆ ఘటనను వీడియో తీసి, తోటి వారికి చూపించి, తాము చేసిన ఘనకార్యాన్ని ఇతరులకు పంచి, తమ మాట వినకుంటే ఇలాంటిదే జరుగుతుందనేలా సంకేతాలు ఇవ్వడం బాధాకరం. జిల్లా పోలీసులు స్పందించి దిద్దుబాటుకు దిగారు. ఇది ర్యాగింగ్ కాదు.. ఇద్దరి మధ్య చోటు చేసుకున్న ప్రేమ గొడవ అంటూ, దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ప్రకటించారు. డిగ్రీ విద్యార్థుల మధ్య జరిగింది ర్యాగింగ్ అంటే అటు కాలేజీ యాజమాన్యం, ఇటు పోలీసులు పర్యవేక్షణ కొరవడిందని, ర్యాగింగ్ రహితం కోసం ఏర్పాటు చేసిన కమిటీల పనితీరు ప్రశ్నార్ధకమవుతుందని పోలీసులు ప్రేమ వ్యవహారంగా తేల్చారని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా ఓ విద్యార్థిపై కొంతమంది విద్యార్థులు దాడి చేసి విచక్షణారహితంగా కొట్టడం దారుణం.

మహిళలపై పెరుగుతున్న అరాచకాలకు రెండవ ఘటన మరోసారి నిదర్శనంగా నిలిచింది. వరదయ్యపాలెం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ వీధిలో వేకువజామున వీధులు శుభ్రం చేసేందుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికురాలికి ఓ హదయ విషాదకర ఘటన కనిపించింది. రోడ్డు పక్కనున్న ఇసుక దిబ్బలో ఓ చిన్నారి కాళ్లు పైకి తేలాడుతున్నాడాన్ని పసిగట్టింది. ఆ ఇసుక చుట్టూ కుక్కలు తిరుగుతుండడంతో అనుమానం మరింత పెరిగింది. చుట్టుపక్కల వారిని పిలిచి అక్కడికి వెళ్లి పరిశీలిస్తే, రోజులు కూడా నిండని ఓ నవజాత శిశువు శరీరాన్ని సగం వరకు ఇసుకలో పూడ్చివేయబడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించి, బొడ్డు కూడా పూర్తిగా కోయని ఆ ఆడ శిశువును పరిశీలించగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. హుటాహుటిన ఆ శిశువును సమీపంలోని ఓ హాస్పిటల్ కు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి తరలించారు. ఆశా వర్కర్లు అక్కున చేర్చుకొని ఆలన పాలన చూశారు. సుదీర్ఘ సమయం ఇసుకలో పూడ్చివేయడంతో , పాప ఆరోగ్యం కుదుటపడకపోగా, 24 గంటలు కూడా గడవకనే మృతి చెందింది. పది నెలలు మోసి, పురిటి నొప్పులు భరించి, ప్రసవించిన బిడ్డను రోడ్డుపై ప్రాణాలతో పడేయడానికి ఆ కన్నతల్లి ఎంతలా విలపించుంటుందో, గత్యంతరం లేక విధిలేని పరిస్థితుల్లో కన్న బిడ్డను రోడ్డుపాలు చేసి తన రక్తాన్ని కంటనీరుగా మార్చుకుంటూ ఆ తల్లి పడిన వేదన ఏ పాటిదో అర్థమవుతుంది. ప్రాణంతో ఉన్న బిడ్డను నడిరోడ్డుపై కన్నంపల్లి వేసేయడానికి ప్రధానంగా రెండు కారణాలు అయి ఉండవచ్చు. అవివాహితురాలైన యువతిని ఏ కామాంధుడో నమ్మించి, తన శీలాన్ని అపహరించి ఉండవచ్చు. ఆడబిడ్డ వద్దంటు అత్తింటి వేధింపులు, భర్త చిత్రహింసలు, కుటుంబ పరిస్థితులు తట్టుకోలేక విధి లేని పరిస్థితుల్లో కన్న వెంటనే ఆడబిడ్డను రోడ్డుపాలు చేసి, కన్నీటి సంద్రములో కొట్టుమిట్టాడుతూ వేదనను అనుభవిస్తూ ఉంటుంది. ఈ రెండు ఘటనలో ఏది వాస్తవమైన, అది నేటి ప్రపంచంలో మహిళలు పడుతున్న దీనస్థితికి దర్పణమే

విద్యుత్ వినియోగదారులకు ట్రూ డౌన్ ఛార్జీలు

ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ వి.చంద్రశేఖర రావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏపీఈఆర్‌సి ఉత్తర్వుల ప్రకారం ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) లో భాగంగా ట్రూ డౌన్ చార్జెస్ రూపంలో వినియోగదారులకు తిరిగి చెల్లించనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వి.చంద్రశేఖర రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉత్తర్వు ప్రకారం ఏపిఎస్ పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మొత్తం రూ.207.95 కోట్లు 12 నెల కాలంలో బిల్లుల రూపంలో తిరిగి చెల్లించబడతాయన్నారు. ఇది ప్రతి యూనిట్‌కు రూ.0.1328 పైసలు తగ్గింపుగా అమలవుతుందన్నారు. 1999లో ఏపీఈఆర్సి స్థాపన అయినప్పటి నుండి వినియోగదారులకు డిస్కాం ద్వారా మొదటిసారిగా ఇలాంటి రీఫండ్ అమలవుతున్న చారిత్రాత్మక నిర్ణయం ఇదన్నారు. తిరుపతి ఆపరేషన్ సర్కిల్ పరిధిలో సుమారు 9.36 లక్షల వినియోగదారులకు రూ.63.18 కోట్లు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఎల్‌టి వినియోగదారులు (లో వోల్టేజ్) 9.35 లక్షల మంది వినియోగదారులు లబ్ధి పొందుతూ రూ.20.32 కోట్లు ప్రయోజనం పొందుతారని, హెచ్‌టి వినియోగదారులు (హై వోల్టేజ్) 1,150 మంది వినియోగదారులు లబ్ధి పొందుతూ రూ.42.86కోట్లు ప్రయోజనం పొందుతారని తెలిపారు. మొత్తం మీద తిరుపతి సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు రూ.63.18 కోట్లు తిరిగి చెల్లించబడతాయన్నారు.

రీఫండ్ అమలు విధానం: 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకు వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ట్రూ డౌన్ చార్జెస్, 2025 నవంబర్ నెల బిల్లుల నుండి ప్రారంభమై 2026 అక్టోబర్ వరకు 12 నెలలపాటు విద్యుత్ బిల్లులలో నేరుగా సవరించబడతాయని ఎస్‌ఈ తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేయించండి : సిపిఎం

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగ నుండి పెద్ద పాలేడు వెళ్లే రహదారి మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం పార్టీ మండల నాయకుడు బాల గురవయ్య ఆరోపించారు. వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు గుంతల మయమై చెరువులను తలపిస్తున్నాయన్నారు. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. గతంలోనే కాంట్రాక్టర్ తారు రోడ్డు వేస్తామని లక్షల రూపాయలు బిల్లు స్వాహా చేసి, రోడ్డు వేయలేదని మండిపడ్డారు. ఈ విషయమై కూడా అధికారులు కానీ, నాయకులు కానీ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వాహనదారులతో కలిసి సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

10వ తేదీ నుంచి ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి వైద్యసేవ పథకంలో భాగంగా హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వెంకటాచలం పేషెంట్లను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాలు), గ్లకోమా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారు తమ ఆధార్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు తీసుకుని స్విమ్స్ శ్రీ పద్మావతి ఆసుపత్రిలో మెడికల్ రికార్డు విభాగంలో ఓపి నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు స్విమ్స్ ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రభంజన్ కుమార్‌ను ఈ క్రింది ఫోన్ నెంబర్‌లో 9491341561 సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో శనివారం స్థానిక ఎంపిడిఓ దిలీప్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన అధికారులు సంబంధిత విషయాలపై సమావేశంలో చర్చించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి సుచేంద్ర ప్రసాద్ తెలిపారు. తహశీల్దార్ కే.జే జే రావు, ఎంపిడిఓ దిలీప్ కుమార్ నాయక్‌లు మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే విధంగా అన్నీ శాఖాధికారులు ఎప్పటికప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దాసరి కోటయ్య, ఎంపిపి దాసరి అంజమ్మ, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన స్టార్ కృష్ణ

ప్రజాశక్తి - ఏర్పేడు : తిరుపతిలోని మాజీ మంత్రి పరస రత్నం నివాసానికి కేంద్ర సామాజిక, సాధికారిక మంత్రి రామదాస్ అథ వాలే శనివారం విచ్చేశారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి కేంద్ర మంత్రికి బుద్ధుడి చిత్ర పటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగి పోయాయని, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ జనాభా పెరిగినందున 15 నుండి 20 శాతం వరకు రిజర్వేషన్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి పరసా రత్నం, వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసాద్ రావు, దళిత నాయకులు చెన్నకేశవ, సురేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జి.ఓ.యం.యస్. నెం. 10 యం.ఎ అండ్ యు.డి డిపార్టుమెంట్, తేది.08.01.2020న ఇచ్చిన అనధికార లేఔట్స్, ప్లాట్స్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు జి.ఓ.ను రివైజ్ చేయడం జరిగింది. అందులో భాగంగా దీవి పాలెం, వేముల పాలెం, పోటు పాలెం గ్రామాల ప్రజలు తమ తమ అనధికార లేఔట్లను లేదా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అదేవిధంగా ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల లోపు వ్రాత పూర్వకంగా తెలియచేయాలని పురపాలక కమిషనర్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా పెరుమాళ్ స్వామి ఊరేగింపు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయ పెరుమాళ్ స్వామి ఊరేగింపు శనివారం సాయంత్రం వైభవోపేతంగా నిర్వహించారు. తమిళ పెరటాసి నెల మూడవ శనివారాన్ని పురస్కరించుకొని సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయ పెరుమాళ్ స్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు నడుమ స్వామి ఊరేగింపు వేడుకగా సాగింది.

శివయ్య అనుగ్రహం సాయికి దక్కింది

కూటమిగా ముందుకుపోతాం : ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి గెలుపుకు కష్టపడ్డ వాళ్ళు ఎంతమంది ఉన్నా.. శివయ్య అనుగ్రహం మాత్రం జనసేన కార్యకర్త కొట్టే సాయికే దక్కిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. పదవులతో సంబంధం లేకుండా కూటమిగా ముందుకెళ్ళి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్, సభ్యుల నియామక జాబితా విడుదలైన సందర్భంగా తొలిసారి ఎమ్మెల్యే బొజ్జల మీడియాతో మాట్లాడారు. కూటమి పొత్తు ధర్మంలో త్యాగాలు చేయకతప్పదన్నారు. ట్రస్టు బోర్డులో పదవులు దక్కించుకున్నవారందరూ కూటమి గెలుపుకు కష్టపడ్డవారేనని కితాబిచ్చారు. ముఖ్యంగా కొట్టే సాయి పార్టీ కోసం కష్టించి పని చేశాడనీ, దెబ్బలు కూడా తిన్నాడని గుర్తు చేశారు. కానీ జనసేన ఇంచార్జిగా వ్యవహరించిన కోటా వినుత కూటమి కోసం పూచికపుల్లంత కష్టం చేయలేదంటూ పరోక్షంగా విమర్శించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా సాయి నిజంగా అర్హుడేనని స్పష్టం చేశారు. పాలకమండలి సభ్యులుగా టీడీపీ నుంచి ముగ్గురికి, జనసేన, బీజేపీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించామని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా బీజేపీ నుంచి ఇంకొకరికి అవకాశం దక్కిందన్నారు. ఇదే అవకాశంగా కొందరు కూటమిలో చిచ్చు పెట్టాలని చూస్తున్నారనీ, వారి ఆటలు సాగవని స్పష్టం చేశారు. త్వరలో జీవో విడుదల అయ్యాక ప్రమాణ స్వీకార మహోత్సవ ఏర్పాట్లు చేస్తామన్నారు. యువకులుగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పదవులు రాని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కెనరా రోబెకో ఏఎంసిచే నివేశ్ బస్ యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కెనరా రోబెకో ఏఎంసి) ఈరోజు నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో దాదాపు నెల రోజుల పాటు నిర్వహించనున్న పెట్టుబడ దారుల విద్యా కార్యక్రమం 'నివేశ్ బస్ యాత్ర'ను ప్రారంభించింది. ఈ బస్సు తిరుపతిలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఇది కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం మీదగా ప్రయాణించి, ప్రతి నగరంలోని స్థానిక నివాసితులకు పెట్టుబడిదారులకు అవగాహన కల్పిస్తుంది. ఈ సందర్భంగా సంస్థ సిఈఓ రజనీష్ నరులా మాట్లాడుతూ "నేటి ఆర్థిక రంగంలో, విజ్ఞానం అనేది అవగాహనలా శక్తివంతమైనదని తెలిపారు. పెట్టుబడి జ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, ఆచరణీయంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. "నివేశ్ బస్ యాత్ర ఆర్థిక విద్యను సమాజాలకు నేరుగా తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇప్పటికే కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు , కర్ణాటక వంటి రాష్ట్రాలకు చేరుకున్నామని, ఇప్పుడు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లకు కూడా తీసుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ నుండి విశాఖపట్నం నివాసితులకు పెట్టుబడులను సరళీకృతం చేయడానికి, అపోహలను తొలగించడానికి, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను స్వీకరించడానికి ఇది సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ గౌరవ్ గోయల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేద్కర్, పూలే ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవం తిరుపతి, మారుతి నగర్‌లో మాజీ మంత్రివర్యులు డాక్టర్ పరసారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాంఘిక న్యాయ, సాధికార శాఖ సహాయ మంత్రి రాందాస్ బంధు ఆత్వాలే హాజరై ఏ.పి.ఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి శివ నాగేశ్వరరావు, ఆంధ్ర తెలంగాణ ఎంఎస్ఎం ఈ చైర్మన్ మంజుల, తిరుపతి మాజీ ఎమ్మెల్యేలు ఏ.మోహన్, సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళా చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివ రుద్రకోటి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, మాజీ టూరిజం డైరెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్రం మంత్రి రాందాస్ బందు అత్వాలే మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మ జ్యోతి రావు పూలే ఫౌండేషన్ ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్ సభ్యులు పరస శాలిని, చింతల సతీష్ చంద్ర, కుమారెడ్డి, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం రోడ్డు ప్రారంభం

శిలా ఫలకాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, మేనకూరు నుండి భీమవరం గ్రామం వరకు 25 లక్షల రూపా యల నాబార్డు నిధులతో నిర్మిం చిన రోడ్డును శనివారం సూళూ రుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. రోడ్డు ప్రారంభోత్సవానికి మేన కూరు చేరుకున్న ఆమె మేనకూరులోని గాంధీ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె నాయకులతో కలిసి భీమవరం రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన స్వగ్రామమైన భీమవరం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ జడ్పిటిసి సభ్యులు పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట తహశీల్దార్ ఎం.రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్ సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గాలి వానతో కూలిన చెట్లు... విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - బాలాయపల్లి : శుక్రవారం రాత్రి గాలీతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని పాకపూడిలో తాటి చెట్టు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో గ్రామంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది పాకపూడికి చేరుకుని విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

తిరుపతికి ప్రతిరోజూ తాగునీరు

■ సిఓసి బిల్డింగ్ భవన నిర్మాణానికి నిధుల సమస్య అధిగమిస్తాం

- మున్సిపల్ పట్టణ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాబోయే రెండు సంవత్సరాల్లో తిరుపతిలో ప్రతిరోజు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు, అందుకు తగ్గట్టుగా ప్రణాళికను తయారు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించడం జరిగిందని మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శనివారం రాత్రి తుడా కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్, తుడా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రతిరోజు తాగునీరు అందించేందుకు 80 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని రానున్న రెండు సంవత్సరాల్లో ప్రతిరోజు తాగునీరు అందించాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. అలాగే తిరుపతి నగరంలో అభివృద్ధి పనులు చేయడం నిధుల సమస్య ఉన్న మాట వాస్తవమేనని ఎల్ఆర్ఎస్, బిఆర్ఎస్ పథకంలో కొంతవరకు నిధులను సమకూర్చుకొని అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. తాగునీతో పాటు రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి కూడా కొన్ని ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని వాటిని త్వరలో చేపడతామన్నారు. తుడా పరిధిలో కొన్ని లేఔట్లు వేయడం జరిగిందని వాటి ద్వారా 45 కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నిధులతో రోడ్లు డ్రైనేజీలు నిర్మాణ పనులు చేపడతామన్నారు. తుడా పరిధిలో వేసిన లేఅవుట్లు కొన్ని వేలం పాటలో కొనుగోలు చేయగా మరికొన్ని పెండింగ్లో ఉన్నాయని వాటిని డిసెంబర్ లోపు వేలం వేసి ఆదాయం పెంచుకోవాలని మంత్రి నారాయణ తుడా అధికారులకు సూచించారు. తిరుపతికి డ్రైనేజ్ సమస్య అధిగమించడానికి ఎలాంటి చర్యలు చేపడతారని విలేకరులు ప్రశ్నించగా ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి సుమారు 250 కోట్లు ఖర్చు అవుతుందని, నిధులు లేవని ఎక్కడైతే సమస్య ఉందో అక్కడ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి సమాధానం ఇచ్చారు. స్మార్ట్ సిటీ పథకంలో సిఓసి బిల్డింగ్ నిర్మాణం ఎప్పటిలో పూర్తి చేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి మాత్రం నిధులు ఇస్తామని చెప్పకపోవడం విడ్డూరంగా ఉంది. సిఓసి బిల్డింగ్ పూర్తవ్వాలంటే 18 కోట్ల రూపాయలు అవసరమవుతుంది అనేది ఎలా ఉంచుకోవాలి అనేదానిపై పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. వర్షాకాలంలో కపిల తీర్థం సమీపంలో ఉండే కాలనీలో మునిగిపోతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని విలేకరులు ప్రశ్నించగా పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయితే తిరుపతి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు ఇస్తామని మంత్రి చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆదాయం పెంచుకోండి అభివృద్ధి చేసుకునే అన్నట్టుగా మంత్రి సమాధానం ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ తుడా వైస్ చైర్మన్ ఇన్చార్జి శుభం బన్సల్, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రహరీ గోడ నిర్మించండి



ప్రహరీ లేని మార్కెట్ యార్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మార్కెట్ కమిటీ యార్డ్ ప్రహరీ గోడ గతంలో వర్షానికి 50 మీటర్లు కూలిపోయింది. అప్పటినుంచి ఇప్పట వరకు అలాగే ఉండిపోవడంతో మార్కెట్ కమిటీకి వచ్చే వాహనాలకు, సరఫరా అయ్యే సరుకుకు రక్షణ లేకుండా పోతోంది. రేషన్ గోడౌన్ కూడా అక్కడే ఉండడంతో బియ్యం లారీలు వస్తూ పోతూ ఉంటాయి. సీజన్‌లో మామిడికాయల వాహనాలు వస్తుంటాయి. వారి లోడ్‌లకు భద్రత కరువైందని రైతులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన పాలక మండలి స్పందించి త్వరలో నూతన ప్రహరీ గోడ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ సెక్రటరీ తులసి రామ్‌ను వివరణ కోరగా నూతన పాలకమండలి సమావేశంలో చర్చలు జురుపుతామని తెలిపారు. ప్రభుత్వం అనుమతి వస్తే నిధులు మంజూరు చేసి తరువాత నూతన ప్రహరీ గోడ నిర్మాణం చేస్తామన్నారు.

కైలాసనాథేశ్వర స్వామి ఆలయ కమిటీ పాలక మండలి సభ్యుల నియామకం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవనం మండలం, అరణ్యం కండ్రిగ పంచాయతీ, శ్రీ కైలాసనాథేశ్వర స్వామి ఆలయం పరిపాలన కమిటి నియామకం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా బాల చంద్ర, ఆలయ కమిటీ సభ్యులుగా టి.రాధా, ఎస్.మోహన్ రాజు, ఏకే.లత, వాసుదేవన్, బాలసుబ్రమణ్యం, శేఖర్, మంగమ్మ, కళా, రత్న సభాపతి, శాంతి, మహేంద్ర శర్మ తదితరులు ఎన్నికయ్యారు. సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి సూచన మేరకు, నారాయణవనం మండలం మండల పార్టీ అధ్యక్షులు గిరిబాబు సహకారంతో కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

ముగిసిన ఎన్‌సిసి ట్రెక్కింగ్ శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎనిమిది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, అండమాన్, పాండిచ్చేరి, కేరళ, లక్షద్వీప్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాల నుండి ఐదు ఎన్‌సిసి డైరెక్టరేట్ల నుండి 510 ఎన్‌సిసి బాయ్ క్యాడెట్లు, 15 మంది అసోసియేట్ ఎన్‌సిసి అధికారుల కోసం ఆల్ ఇండియా ఎన్‌సిసి ట్రెక్కింగ్ క్యాంప్ శనివారం తిరుపతి, ఎన్‌సిసి నగర్‌లో ఒక గొప్ప సాంస్కృతిక కార్యక్రమం బరాఖానాతో ముగిసింది. సెప్టెంబర్ 25న ప్రారంభమైన ఈ శిబిరంలో శేషాచలం బయోస్పియర్ రిజర్వ్, పరిసర ప్రాంతాలు, తిరుమల జూలాజికల్ పార్క్, రీజినల్ సైన్స్ సెంటర్, నాగర్వణం ఎకోలాజికల్ పార్క్ మొదలైన వాటిలో ట్రెక్కింగ్ జరిగింది. ముగింపు కార్యక్రమంలో ఎన్‌సిసి గ్రూప్ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా పాల్గొన్నారు. క్యాడెట్‌లకు క్యాంప్ సర్టిఫికేట్, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్తు సర్వీసుపై వైసీపీ రాజకీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) వ్యవసాయ మోటారుకు విద్యుత్తు లైను లాగే విషయంలో వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని మండలం, బోనుపల్లికి చెందిన టీడీపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ సానుభూతిపరులైన రైతులు టీడీపీ సానుభూతి పరుడైన వెంకటాద్రి నాయుడి విద్యుత్ స్థంబాలను ధ్వంసం చేయడమే కాకుండా ఆయన కుమారుడిపై దాడి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలు నాటే సమయంలో లేని ఇబ్బంది తీగలు లాగేటప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పైగా టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ పై రాజకీయంగా విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో రైతుల మధ్య రాజకీయ చిచ్చు పెట్టాలని చూస్తున్న ఆ ఇద్దరి వైసీపీ నేతల అవినీతి గుట్టు తమ వద్ద ఉందనీ, త్వరలోనే తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

క్రైం న్యూస్

ఆగివున్న లారీని ఢీ కొన్న కంటైనర్

ప్రజాశక్తి - తడ : తడ మండలం, తడ నేషనల్ హైవేపై చెన్నైకు పోవు మార్గంలో నిప్పో కంపెనీ ఎదురుగా ఆగివున్న లారీని మరొక కంటనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ డ్రైవర్ తమిళనాడుకు చెందిన వీరమణి (37) లారీలోనే ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారంతో అక్కడకే చేరుకున్న పోలీసులు ఇరుక్కు పోయిన లారీ డ్రైవర్‌ను అతి కష్టంమీద బయటకు తీసి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నాయుడుపేట నుండి తిరుచ్చికి వరి ధాన్యం లోడుతో వెలుతున్న లారీ తడ కండ్రిగ నిప్పో కంపెనీ ఎదురుగా నేషనల్ హైవే మీద డీజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఒంగోలు నుండి చెన్నై పోర్టుకు గ్రానైట్ లోడుతో వస్తున్న కంటైనర్ లారీ ముందు వున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఆగివున్న ధాన్యం లారీని ఢీ కొనింది. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ ముందు బాగం నుజ్జు నుజ్జు అయి డ్రైవర్ వీరమణి క్యాబిన్‌లోనే ఇరుక్కు పోయి విలవిలలాడాడు. రెండు గంటల పాటు పోలీసు వారు, హైవే సిబ్బంది, తోటి లారీ డ్రైవర్‌లు, స్థానికులు కలిసి ఇరుక్కు పోయి వున్న వీరమణిని క్రేన్ సాయంతో అతికష్టం మీద బయటకు తీశారు. తడ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిరణ్ రాయల్ వివాదంలో మరో ట్విస్ట్

బాధితురాలు వైసీపీ, జనసేన నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జన సేననేత కిరణ్ రాయల్ వివాదంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. కిరణ్ రాయల్ కేసు బాధితురాలు లక్ష్మీరెడ్డి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో జనసేన, వైసీపీ నేతలపై శనివారం పిర్యాదు చేసింది. గతంలో కిరణ్‌పై పలు ఆరోపణలు చేసిన లక్ష్మీరెడ్డి ఇప్పుడు సంచనలన నిజాలను భయట పెట్టినట్లు మీడియాకు వెల్లడించింది. జనసేన నేత దినేష్ జైన్, హరి శంకర్, గనితోపాటు వైసీపీ నేత పసుపులేటి సురేష్‌పై పలు ఆరోపణలు చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన ఫోటో, వీడియోలను వైసిపి నాయకులు పసుపులేటి సురేష్ మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసారని, సురేష్‌కు జనసేన నేతలు దినేష్ జైన్, గని, హరి శంకర్ సహకరించారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఉన్న మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలను డిలీట్ చేయాలని కోరినా స్పందించడం లేదని, పైగా డిలీట్ చేయమంటే సైలెంట్‌గా ఉండాలని జనసేన, వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని పేర్కొంది. మార్ఫింగ్ వీడియో, ఫోటోలను వైరల్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు లక్ష్మీరెడ్డి తెలిపింది.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బాలాయపల్లి: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ విజయలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండలంలోని మేల్చూరులో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మేల్చూరుకు చెందిన చింతల శివ, మరో నలుగురుకి గ్రామంలో 5 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి వున్నారు. అయితే శివ తనకిచ్చిన స్థలంతో పాటు మరో 18 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. దీనిపై హక్కులు కలిగిన నలుగురు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అక్రమ కట్టడాలు చేపట్టరాదని రెవెన్యూ అదికారులు పలు మార్లు హెచ్చరించినా, శివ లెక్క చేయకుండా నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారులు పోలీసు బందోసబస్తుతో రేకులు తొలగించి చుట్టు ఏర్పాటు చేసిన కంచెను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎవి రమణ, ఎస్సై గోపీ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబలపూడిలో చోరీ

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని అంబలపూడి ఎస్సీ కాలనీకి చెందిన పోతుగుంట ఓసూరయ్య, పల్లిపాటి మాదవయ్య ఇళ్లలో గుర్తు తెలియని దుండుగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. మాదవయ్య రాత్రి గాడ నిద్రలో ఉండగా గుర్తు తెలియని దుండుగలు ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి నాలుగు సవర్ల బంగారు నగలు, ముప్పైవేలు నగదు, మోటారు బైకు, సెల్ పోన్ చోరీకి పాల్పడ్డారని మాదవయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏకాంబర కుప్పం– వేపగుంట రైల్వే లైన్‌పై గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు ఏకాంబర కుప్పం– వేపగుంట ఆర్ఎస్ఎస్ మధ్య కె ఎంనెం.97/24-26 పోస్టుల వద్ద సుమారు 35 - 40 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో అతను రైలు కింద పడినట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మృతుడి శరీర భాగాలు నుజ్జునుజ్జయినట్లు తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, పసుపు చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎడమ చేతి మణికట్టుపై పుట్టుమచ్చ ఉందని ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని కోరారు.

గురువంటే పాఠాలే కాదు..

ప్రజాశక్తి -ఏర్పేడు : ఉపాధ్యాయులు అంటే కేవలం విద్యార్థులకు పాఠాలు చెప్పడం మాత్రమే కాదని, వారికి అన్ని రంగాలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఏర్పేడు మండలం, బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎస్ఆర్పి సుబ్రమణ్యం ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టినప్పటి నుండి విద్యార్థులకు చేరువగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నానని తెలిపారు.

విద్యార్థులకు అన్ని విధాల అండగా...

మారుమూల ప్రాంతాలలో పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్యను సమర్ధవంతంగా అందించినందుకు అమెరికన్ ఇండియా ఫౌండేషన్ డిజిటల్ ఈక్వలైజర్ సంస్థ ఆయన గుర్తించిందని తెలిపారు. తన ఆధ్వర్యంలో విద్యార్థులు ఇస్రోలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారని తెలిపారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో చెట్లు నాటడం, పరిశుభ్రంగా ఉంచుకోవడం, స్కౌట్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా..

సి.ఆర్.సి లో జిల్లా స్థాయి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా విజయవాడలో జరుగే ప్రతి ట్రైనింగ్‌ను తీసుకుని, నేర్చుకున్న విద్యను మండల, జిల్లా

అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం

స్థాయిలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కె.ఎల్.యూనివర్సిటీ, వడ్డేశ్వరం, విజయవాడ, విట్ అమరావతీల్లో శిక్షణను తీసుకున్నాని, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు అక్టోబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

పలు అవార్డులు- రివార్డులు..

తమ 8సంవత్సరాలల ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు ఆంగ్లంలో నూరు శాతం ఉత్తీర్ణత తీసుకురావడంతో 2024 లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ల చేతి మీదగా అందుకున్నట్టు వివరించారు. కంప్యూటర్ విద్యాబోధనను సమర్థవంతంగా పేద విద్యార్థులకు అందించినందుకు ఏఐఎఫ్‌ఈ సంస్థ ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్టు తెలిపారు. ఇటీవల స్టేట్ రిసోర్స్ పర్సనల్ ఎంపికయి ట్రైనింగ్ అనంతరం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకట కృష్ణ చేతుల మీదగా పార్టిసిపేట్ సర్టిఫికెట్ను అందుకున్నానన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు, నటనలోనూ సిసిఆర్‌టి, న్యూ ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ తరపున అల్లూరి సీతారామరాజు పాత్రను మెప్పించి డైరెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నానని తెలిపారు. ఇలా అన్ని రంగాలలో దాదాపు 25 అవార్డులు తన కృషికి దక్కాయాని సంతృప్తిని వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. No. 4 / 2025
Piduru Padma Sundari and 2 others ...వాదులు
మరియు
Vepakamma Surya Narayana Rao And 21 others ....ప్రతివాదులు
దావానోటీసు
Defendant No.6
Smt. Pellakuru Jalaja Seshu Reddy, W/o Seshu Reddy, I.C.S. Road, D.V.R.Palli, Gudur Town, Tirupati Dit.
Defendant No.7
Smt. Mangalapuru Venkata Rathnam Nalina, D/o Venkata Rathnam Reddy, I.C.S. Road, D.V.R.palli, Gudur Town, Tirupati Dit.
పై దావాలో వాదులు పై దావా షెడ్యూల దాఖల ఆస్తిలో బాగ దామాషా (Partition) కోరుతూ పై కోర్టులో దావా వేసినందున మీకు నోటీసు నిమిత్తం తేది. 10-10-2025 న వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు గాని మీ తరపున వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు,
ఎస్. చంద్రమోహన్ రెడ్డి
వాది తరపున వకీలు, గూడూరు.

In The Court of The I Addl. Junior Civil Judge : Nellore.
E.P.No. 190 / 2021
Dispute No. 117 / 2018
M/s. Shriram Raghavendra Chits Pvt. Ltd., Nellore Branch - Decree Holder
Vs
1. Syed Manjur Ahamad, and others - Judgment Debtors
Notice
JDR-2 : Pandi Venu,
S/o **Ramanaiah,** SGT, M.P.P. School, Pedhapariya Rajupalem, Ozili Mandal, Tirupathi District.
పై నెంబరున డిక్రీ హోల్డరు డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు మీ జీతంను జప్తుచేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై మీపై దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21, రూల్ 48 నోటీసు నిమిత్తం **తే09-10-2025** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.సుధీర్ రెడ్డి, B.Com., B.L.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.